# కాశ్మీర మజిలీలు

(బోండా ఆతిథ్యము)

శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారు

ఇంకా మబ్బు అట్లే యున్నది. కారుచీకటిలో అదేరీతిగ మఱి కొంతసేపు నడచితిమి. నడుమనడుమ ముండ్లపొదలలో బొర్లబడుచుంటిమి. జోడు తొడుగుకొని ఉంటిని. కాని ఆ సమయంలో అది పనికిమాలినదైనది. ఒళ్లంతా గీరుకొనిపోయినది. కంటకములూ, సంకటములూ కలిసినపుడు మానవమాత్రుని స్థితి యెట్లుండునో యోచింపుడు. బుడింకాయి హాహాకారములు చేయ మొదలిడినాడు. బోండా వగర్చుచు కూలబడునపుడు "బాబారే!" అని కెవ్వుమనుచున్నాడు. చీకటి యగుటచే పాపము అతడు కూడా దారి దప్పినాడు. ఉస్సురస్సురనుచు, మఱేమీ పలుకక నేను నడుచున్నాను. కుక్కమొఱుగులు వినుపింప సాగినవి. కొంతదూరమున దీపములు ఎఱ్ఱని వింత మిణుగురులవలె తళుక్కొత్త దొడగినవి. గమ్యస్థానము ఇకెంతో దూరమున లేదని సంతసించితిని. ఎట్టకేలకు ఊరు చేరుకొంటిమి.

ఏ వంక జూచినా గుడిసెలే అగపడినవి. కొన్ని కొంపలు పెద్ద బొమ్మరిండ్లవలె నున్నవి. ఊరు నడుమనుండి నడచుచుంటిమి. రాత్రి చాల ప్రొద్దుపోయినది. నడువీధిలో నొక కమ్మరి కొలిమి కనుపించినది. ఒకయాడుది యిటూ అటూ ఊగుచు పెద్దతిత్తిని నొక్కుచు నిప్పులు రవుల్కొలుపుచున్నది. ఎఱ్ఱగ గాలిన యినుపకమ్మును సమీపమున బలిష్టకాయు డొకడు బలముకొలది కొట్టుచున్నాడు. ఊరివారలు కొందఱు చుట్టూ కూర్చుని ఉన్నారు. చలిగాలి రివ్వున వీచుచుండుటచే కొలిమిచుట్టు, వారు చేరి రనుకొంటిని. ప్రక్కనుండి మమ్ము వారు తేఱిచూచిరి. నేను పరిచితుడనుకాను కదా! "కహాఁకాఅద్మీ?" (ఎక్కడివాడు?) అని మెల్లగా వారిలో వారనుకొన్నారు. నేనేమియు పలికితినిగాను. బుడంకాయి మాత్రము నిమిషముసేపు కొలిమిదగ్గఱ కూర్చుని వెంటనే పరుగున నన్ను జేరుకొనిననాడు. బోండానుచూచి "నమస్తే మహరాజ్!* అభీకహాఁసే?" ("అయ్యా! నమస్కారము. ఇపుడెందుండి?") అనిరి. అతడు ప్రత్యుత్తరమీయలేదు. పాపం ఆయాసపడుతూ, ఊగుతూ నడుస్తున్నాడు.

అరగడియలో బోండాయిల్లు చేరుకొన్నాము, తాటాకుకొంప! భూమికి ఎంతో ఎత్తుగా లేదు. వీధి అరుగులు అంత చిన్నవికావు. పోయి నేనూ పొట్టి పిచికే ఒకవా

* ఉత్తరహిందూస్థానమున బ్రాహ్మణుని "మహరాజ్!" అని పిలతురు.

చతికిలపడ్డాము. బోండా తలుపు తట్టినాడు. ప్రత్యుత్తరమేమీ రాలేదు. మళ్లీ తట్టినాడు. లోపలినుండి ఏదో వికృత శబ్దము వినవచ్చినది. "ఎలుగుబంటి అరుస్తూ వున్నదేమో" అని అదలితిని. మేము వచ్చినది ఏదేని గుహకాదు కదా! కొంతసేపటికి ఎవరో తలుపు తెఱచిరి. లోపల గుడ్డిదీపము వెలుగుతూ వున్నది. క్షీణాలోకంలో తలుపు తెఱచిన ఆడుది కనుపించినది. ఆమె బోండాకు అప్పగారై ఉండునని ఆమె స్థూలశరీరమే చెప్పినది. నిద్దురనుండి లేస్తూ ఆమెయే కాబోలు ఆ సమయంలో ఎలుగుబంటివలె మూలిగినది! ఆమె వెనుక నొక యిల్లాలున్నది. బోండా పెండ్లాము కాబోలు! అపుడే యీామెకు నడుము వంగిపోయినది. మొదటియామెను తేఱిచూచి బుడంకాయి కులుకుచు, ఏమో గొణిగినాడు. "చూప్!" అని ఒక మొట్టికాయతో వాని నోరు మూసితిని. కట్టనూత గొని బోండా అక్క గుడ్డిదీపంతో యీవలికివచ్చి యించుమించుగా దానిని మా మొగములచెంతకు దెచ్చి తేఱిచూడసాగినది. బోండా మెల్లగా జారినాడు కాని మమ్ములను అప్పగారికి యింట్రడ్యూస్ చేసినాడుకాడు. అర్ధరాత్రమున మేమేల దాపురించితిమో యని ఆమె కుతకుతలాడుచున్నదని ఆమె మొగమే చెప్పుచున్నది. చేతగల కట్టతో ఒకటి రెండు వడ్డించునని అదలితిని. ఏమనుటకు నాకు పాలుపోలేదు. అట్లే కూర్చుని ఉన్నాను. దీపంతో ఆమె తన్ను సమీపించే సరికి పిచికిగాడు "హూ! హుం! హూ!" అని ఉరుగొట్టినాడు. ఆమె వెనుకకు తగ్గినది. ఇంతలో బోండా ఒకబిడ్డను చంకబెట్టుకొని వచ్చి "బాబూజీ! నా మనుమరాలు!" అనినాడు. "బాబూజీ కోన్ హై?" అని ఆడుబోండా అడిగినది. "వీరు దక్షిణదేశపు బ్రాహ్మలు. అమృతసరంలో కలుసుకొన్నాము. నేనే రమ్మని తీసుకొనివచ్చాను" అని తమ్ముడనినాడు. ఆమె కొంచం శాంతించినది. "అతడో?" అని బుడంకాయిని చూపి అడిగినది. "ఈ దేశస్థుడే! కాని వీరి పరిచారకుడు" అని బోండా పలికినాడు. ఇష్టాగోష్ఠితో కొంతసేపు కడచిపోయినది. "సబ్ హోచుకా" (అంతా అయినది) అని యిల్లాలు లోనుండి పలికినది. "బాబూ సాబ్! ఇక లేవండి. స్నానంచెయ్యండి. భోజనానికి ఆలశ్యమయింది" అని బోండా పలికినాడు. ఆ సమయంలో వానికీ, వాని భార్యకూ కష్టము కలిగించుచున్నందులకు మిగుల వగచితిని. "అయ్యా! నాకిపుడు భోజనపు అపేక్ష ఏమీ లేదు. స్నానమాత్రంచేసి పండుకొనెదను" అని బోండాతో చెప్పినాను. "ఉఠియే! మహరాజ్జీ! ఘర్‌తో ఆబ్ కాహై" (అయ్యా! లేవండి. ఇల్లు తమదే!) అని గుమ్మముచెంత నిలిచి యిల్లాలు పలికినది. ఆమె వచనము ఆదరపూరితమై యున్నది. గృహిణి ఉదారస్వభావము కలది యని గ్రహింప గలిగితిని. . ఇల్లాలు విశాలహృదయయయ్యెనేని, తక్కినవారెట్టివారైననేమి? ఏమనుకొనినదో కాని బోండా అక్క "ఉఠియే! పండిజ్జీ! నహాయియే! కూచ్

రొట్టీఖాయియే!" (అయ్యా, లేచి స్నానంచేసి కొంచం రొట్టె తినండి)అనినది. బోండాతో కూడ దొడ్డిలోనికి పోతిని, పాపము యిల్లాలు బిందెనిండా వేడినీళ్లు తొలిపి ఉంచినది. స్నానముగించి పెరడును పరికించితిని. బోండా బుడంకాయలుకూడా స్నానముగించిరి.

ఇల్లాలు దొడ్డి వసారాలో మూడు పీటలు వేసినది. సమీపమందున్న పొయ్యిపై పరోటాలు కాల్చుచున్నది. ఇంతలో ఆడుబోండా మూడువిస్తళ్లు తెచ్చి పీటల ముందు పఱచినది.

నిజముగా అపుడు ఆహారముపై అపేక్ష లేక నే నట్లు పలుకలేదు. "పాపము వీరిని శ్రమపెట్టుటేల? అని అట్లంటిని. ఇపుడు పరోటాలు వేడిపెనముమీదనే నేతితోనే కుతకుతలాడుతున్నవి! మనసు పరోటాలమీదినుండి దిగినదికాదు. కాని ఒక పర్యాయము వలదని యిపుడు పరోటాలతో ఉదరమును పూరించుట తగదని, పరిహాసమునకు పాత్రుడనగుదునని జంకి నిలిచి కొంతసేపు తటపటాయించితిని. పిచికి ముందే పీటపై కూర్చున్నాడు. "బైఠియే! బాబూసాబ్!" అని బోండా నన్నొకపీటపై కూర్చుండ బెట్టి, తాను ప్రక్కపీటపై చతికిలపడినాడు. ఆడుబోండా మూడుగ్లాసులతో పాలు తెచ్చి అచ్చట బెట్టినది. ఇంటిపాడి కాబోలు! పాలుత్రాగి ఊరుకొన నిశ్చయించితిని. కాని యేమని తెలుపుదును? యీ నిశ్చయమెంతో సేపు నిలువలేదు.

బెండకాయలవలె నున్న ఊరవేసిన మిరపకాయలను ఒక్కటొక్కటిగ ఆమె వడ్డించినది. ఉత్తరహిందూస్థానీయుల కివి మిగుల ప్రీతికరమైనవి. వీనిలో నెంతో కారముండదు. వీనియెడల నాకును గాఢానురాగము కలిగినది. రాజస్థానములో నున్నపుడివియే మాకు శరణ్యములై యుండెడివి. ఎదుటబడిన పిదప వీనిని విడచుటకు నా మనసొప్పినది కాదు. పరోటాతో సహాకరించినపుడు వీని రుచి యినుమడించునని యెఱుగుదును. మొదటిపాటను పాడుట మాని పీటపై గట్టిగా చతికిలపడితిని. గడుసువాడను! ఒకగిన్నెలో పలుచని పప్పును, మఱొకగిన్నెలో ఆలూకారన్ (బంగాళాదుంపల రసము)ను బోసి యిల్లాలు ఆకులపొంత బెట్టినది. పప్పుగిన్నెలో బోండా అక్క కొంచం మిరియాల పొడుము వేసినది. తన విస్తరిపై బోండా థాళీ (పళ్లెము) పెట్టించుకొనినాడు. ఉత్తర హిందూస్థానీయులు తఱచుగ పళ్లెములలోనే భోజనము చేతురు. మెల్లగ నొక్కటొక్కటిగ వేడి పరోటాలు ఆరగించి, పాలుత్రాగి, లేచి, చేతులు కడుగుకొంటిమి.